క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నేత కుటుంబానికి పరామర్శ



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ యనమలకుదురు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కోసూరి నరేష్‌కుమార్ తండ్రి కోసూరు రామకృష్ణ (65) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. దీంతో నరేష్‌కుమార్‌ను వైఎస్సార్ సీపీ నేతలు శనివారం పరామర్శించారు. పార్టీ సీనియర్ నాయకుడు దేవభక్తుని సుబ్బారావు, పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి రామకృష్ణకు నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు గుమ్మడి విజయ్‌కుమార్, మరీదు శ్రీనివాసరావు, ఈడే గోపాలకృష్ణ, యార్లగడ్డ వీరబాబు, అష్రఫ్, పలువురు నేతలు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



పాతపాడు(విజయవాడరూరల్): అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం పిల్లలకు ఆహార పదార్థాలు పెట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ పీ మురళీకృష్ణప్రసాద్ సూచించారు. పాతపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. వెజిటబుల్ బిర్యానీ, సాంబారు, ఆకుకూరల ఆహార పదార్థాలను పరిశీలించారు. అలాగే చిన్నారుల హాజరు పట్టికను పరిశీలించారు. మెనూను పాటించాలని సిబ్బందికి సూచించారు. తొలుత గ్రామంలో పింఛన్ పంపిణీని ఆయన పరిశీలించారు. లబ్ధిదారుల వివరాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి కోటిలింగమ్మను అడిగి తెలుసుకున్నారు.

పింఛన్ల పంపిణీ



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం పలు గ్రామాల్లో శనివారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. పలు గ్రామాల్లో సాంకేతిక సమస్య ఎదురవ్వడంతో కొంత మేర ఇబ్బందులు తలెత్తాయి. రూరల్ మండల ఇన్‌చార్జి ఎంపీటీవో కృష్ణ ప్రసాద్ పలు గ్రామాల్లో పర్యటించి పింఛన్ల పంపిణీని పరిశీలించారు. పలువురు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో..

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో శనివారం పింఛన్‌లు పంపిణీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 12,677 మంది పింఛన్‌దారులు ఉన్నారు. సాయంత్రానికి తాడిగడప మున్సిపాలిటీలో 85 శాతం, పెనమలూరు మండలంలో 88 శాతం చొప్పున పింఛన్లు పంపిణీ చేశారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



కంకిపాడు: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కంకిపాడు సీఐ జే మురళీకృష్ణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు పర్యవేక్షణలో కంకిపాడు పోలీసుస్టేషన్‌లో శనివారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ మహిళా సంరక్షణకు రూపొందించిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీసు వ్యవస్థ, కమ్యూనికేషన్ సిస్టమ్‌పై అవగాహన అవసరమని తెలిపారు. ఆయుధాల నిర్వహణ, వినియోగం గురించి తెలుసుకోవాలని చెప్పారు. మహిళా సంరక్షణకు పోలీసు సిబ్బంది అంకితభావంతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ డీ సందీప్, అదనపు ఎస్‌ఐ డీ తాతాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్ వైపు అడుగులు వేయాలి

నున్న(విజయవాడరూరల్): విద్యార్థులు సైన్స్ వైపు అడుగులు వేయాలని రిటైర్డ్ సైన్స్ ఉపాధ్యాయుడు వై.సాంబిరెడ్డి సూచించారు. నున్న రవీంద్రభారతి హైస్కూల్‌లో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు సీవీ రామన్‌ను స్ఫూర్తిగా తీసుకొని నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని సూచించారు. స్కూల్ చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ వీరమాచనేని శాంతి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి రమేష్, ప్రిన్సిపాల్, ఏఓ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముందు నుయ్యి.. వెనుక గొయ్యి

- రైల్వేట్రాక్, రైవస్ కాలువ మధ్య అంగన్‌వాడీ కేంద్రం
- ప్రమాదకర స్థితిలో చిన్నారులు
- సురక్షిత ప్రాంతానికి మార్చాలని తల్లిదండ్రుల డిమాండ్



రైవస్ కాలువ కట్టపై ఉన్న అంగన్‌వాడీ కేంద్రం



అంగన్‌వాడీ కేంద్రంలో విద్యనభ్యసిస్తున్న చిన్నారులు

రామవరప్పాడు: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామంటూ ఊదరగొడుతున్న కూటమి ప్రభుత్వం శివారు ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధిని గాలికి వదిలేశాయనడానికి సజీవ సాక్ష్యం ఈ అంగన్‌వాడీ కేంద్రం. విజయవాడరూరల్ మండలం నిడమానూరు శివారు గ్రామం దోనే ఆత్కూరులోని కోడ్ నంబరు 618వ కేంద్రంలో చిన్నారులు బిక్కు బిక్కుమంటూ ప్రాథమిక విద్యనభ్యసిస్తున్నారు. ఈ కేంద్రానికి ముందు నుయ్యి, వెనుక గొయ్యి చందాగా విద్యార్థుల పాలిట శాపమైంది. ముందు ఉన్న రైల్వే ట్రాక్‌పై నిత్యం రైళ్ల రాకపోకలు, వెనుక ఉన్న రైవస్ కాలువలో నీటి ప్రవాహంతో చిన్నారుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

ఆందోళనలో తల్లిదండ్రులు

ముందు రైల్వేట్రాక్, వెనుక రైవస్ కాలువ ఉండటంతో చిన్నారులను ఈ అంగన్‌వాడీ కేంద్రానికి పంపడానికి తల్లిదండ్రులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ కేంద్రానికి వెళ్లడానికి కనీసం నడక మార్గం కూడా లేకపోవడంతో చిన్నారులు దీనస్థితిలో తమ నర్సరీ విద్యను వెల్లదీస్తున్నారు. రైల్వే ట్రాక్‌కు అతి సమీపంలో ఉండటంతో నిత్యం పదుల సంఖ్యలో రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. పైగా కాలువ కట్టపై రేకుల షెడ్డులో ఉన్న ఈ కేంద్రంలో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరంగా మారిన ఈ కేంద్రానికి చిన్నారులను పంపేందుకు ఆశక్తి కనిపించకపోవడంతో రానూ రానూ హాజరు శాతం కూడా తగ్గుతోంది. ప్రస్తుతం ఈ కేంద్రంలో చదువుతున్న సుమారు 12 మంది చిన్నారులకు ఓ టీచర్, ఆయా ఉన్నారు. చిన్నారి విద్యార్థులను ఆడిపించేందుకు కూడా అవకాశం లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రం తలుపులు మూసి వేసి పర్యవేక్షించాల్సిన దుస్థితి నెలకొం ది. దీంతో ఈ కేంద్రం లో పిల్లలను చేర్పించడానికి ఈ ప్రాంతంలోని తల్లిదండ్రులు ఆశక్తి చూపడం లేదు. చేసేదేమీ లేక ఉన్న కొద్ది పాటి విద్యార్థులతో నెట్టుకొస్తున్నారు.



అంగన్‌వాడీ కేంద్రానికి ముందున్న రైల్వే ట్రాక్‌పై వెళ్తున్న రైలు



వెనుక ఉన్న రైవస్ కాలువ

అంగన్‌వాడీ కేంద్రాన్ని తరలించాలి

ప్రస్తుతం ఇక్కడ ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ముందు రైల్వే ట్రాక్, వెనుక రైవస్ కాలువ ఉండటంతో చిన్నారుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధాన గ్రామానికి తరలించాలని వేడుకుంటున్నారు. గతంలో ఈ సమస్యపై పలు మార్లు నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు పరిష్కార మార్గాలను చూపలేదని ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఉన్న కామన్ స్థలంలో ఈ కేంద్రానికి స్థలం కేటాయిస్తామని గతంలో హామీలు ఇచ్చారని గుర్తుచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మొద్దు నిద్ర వీడి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

తడి-పొడి చెత్త వేరువేరుగా సేకరించాలి

కంకిపాడు: తడి చెత్త-పొడి చెత్త వేరువేరుగా సేకరించాలని మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి సూచించారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో తడి చెత్త, పొడి చెత్త సేకరణపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా పంచాయతీ సిబ్బందికి అప్పగించాలని సూచించారు. ఎంపీడీఓ పీ అనూష మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త సేకరణతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కిరణ్మయి, సర్పంచ్ పీ ఇందిర, పంచాయతీ కార్యదర్శి చింతా కిరణ్‌కుమార్, డ్వాక్రా బుక్ కీపర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు



గన్నవరం రూరల్: రంజాన్ మాసం నెలవంక దర్శనంతో మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. ముస్తాబాద గ్రామంలోని జామియా మసీదును విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం నుంచి ఉపవాసాలు ప్రారంభమవుతాయని మసీద్ ఇమాం హసీన్ ఇక్బాల్ తెలిపారు. నెల రోజుల పాటు ఉపవాసం ఉండే భక్తుల కోసం, ఉపవాసం దీక్ష విరమణకు ఏర్పాట్లు చేశామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సూరంపల్లి, చిక్కవరం, వీరపనేనిగూడెం తదితర గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

దాడి ఘటనపై కేసు

పెనమలూరు: సనత్‌నగర్‌లో పాత గొడవల కారణంగా దాడి చేసిన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కానూరు సనత్‌నగర్ రెండవ లైన్‌కు చెందిన షేక్ అబ్దుల్ అజీజ్‌కు ఇద్దరు కుమారులు అబ్దుల్‌హకీమ్, అబ్దుల్‌రహీమాన్. వారితో నయామ్, నజీర్, కరీం, సమీర్ మరికొందరు గొడవ పడ్డారు. ఈ సమాచారం తెలుసుకున్న అజీజ్ తన పిల్లలు, బావమరుదులతో కలిసి నయామ్, నజీర్, కరీం, సమీర్ వద్దకు వెళ్లి ప్రశ్నించగా వారు కర్రలతో అజీజ్‌పై దాడి చేశారు. అజీజ్ బావమరుదులు ఖలీల్, సలీం గొడవ నివారించే యత్నం చేయగా వారిపై కూడా దాడి చేశారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించండి

వెటర్నరీ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్



గొల్లనపల్లిలో గాలికుంటు నివారణ టీకా వేస్తున్న డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్

గన్నవరం రూరల్: పశువులకు గాలికుంటు టీకాలు వేయించి వాటి ఆరోగ్యాన్ని పశుపోషకులు కాపాడుకోవాలని పశుసంవర్థక శాఖ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్ సూచించారు. మండలంలోని కొండపావులూరు, గొల్లనపల్లి గ్రామాల్లో పశువైద్య చికిత్స కేంద్రాలను శనివారం ఆయన సందర్శించి జాతీయ పశువ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా గాలికుంటు వ్యాధి నిరోధక, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో తీవ్ర జ్వరం, నోటి నుంచి చొంగ, నోరు, గిట్టల మధ్య పుండ్లు, రొప్పటం, ఈసుకుపోవడం గాలికుంటు వ్యాధి లక్షణాలని తెలిపారు. నాలుగు నుంచి ఎనిమిది నెలల వయసు గల పెయ్య దూడలకు బ్రూసెల్లోసిస్ నిరోధక టీకా వేయించాలని సూచించారు. సకాలంలో పశుపోషకులు ఈ టీకాలు వేయించాలని, అన్ని పశువైద్యశాలల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు జాతీయ పశువ్యాధి నియంత్రణ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు వివరించారు. రైతుల ఆర్థిక ప్రగతికి ఈ టీకాల కార్యక్రమం ఉపయోగపడుతుందని చెప్పారు. ఏడీఏ డాక్టర్ వి.బాలకృష్ణ, గొల్లనపల్లి, ముస్తాబాద వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లు డాక్టర్ రెడ్డెమ్మ, డాక్టర్ మేరీ వైడూర్యం, సిబ్బంది పాల్గొన్నారు.

రామవరప్పాడు: పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధిపై పశుపోషకులు అవగాహన కలిగి ఉండాలని నిడమానూరు పశువైద్యాధికారి కే సతీష్‌కుమార్ అన్నారు. విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని పశు వైద్యశాలలో శనివారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని విజయవాడ డివిజన్ ఉప సంచాలకుడు డాక్టర్ రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు, బ్రూసెల్లోసిస్ టీకాలను పశుపోషకుల ఇంటి వద్దనే పశువైద్య సిబ్బంది వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ శ్రావణి, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఖాసీం పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

గన్నవరం: ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పేపర్-1 సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించారు. కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో తొలిరోజు పరీక్షకు మొత్తం 550 మంది విద్యార్థులకుగాను 528 మంది హాజరుకాగా 22 మంది గైర్హాజరయ్యారు. స్థానిక చైతన్య జూనియర్ కళాశాలలో 218 మంది విద్యార్థులకుగాను 209 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ భద్రతను ఏర్పాటు చేశారు.

ఉయ్యూరు: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆకునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉయ్యూరులోని శ్రీ శ్రీనివాస, ఏజీఅండ్‌ఎస్‌జీ సిద్ధార్థ, నారాయణ, శ్రీచైతన్య, శ్రీ విశ్వశాంతి జూనియర్ కళాశాలల్లో ఆరు పరీక్ష కేంద్రాల్లో తొలి రోజు పరీక్షలు నిర్వహించారు. 2,425 మంది విద్యార్థులకు గానూ 2,303 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

పెనమలూరు: ఇంటర్ పరీక్షలు మొదటి రోజు శనివారం ప్రశాంతంగా జరిగాయి. మండల పరిధిలో 20 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సీఐ వెంకటరమణ తెలిపారు.

అనధికార కట్టడంపై ఫిర్యాదు



నీటిపారుదల శాఖకు చెందిన స్థలంలో బందరు కాలువ కట్టపై నిర్మిస్తున్న భవనం

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో విలువైన నీటిపారుదల శాఖ స్థలం బందరు కాలువ కట్టపై అనధికారికంగా నిర్మిస్తున్న భవనంపై స్థానికులు గ్రామ పంచాయతీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామస్తులు శనివారం వివరాలు తెలుపుతూ.. గ్రామంలో మహిళా మండలి కాలువ కట్టపై ఓ మహిళ భవనం నిర్మిస్తోందని గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశామని తెలిపారు. కాలువ కట్టపై శాశ్వత భవనాల నిర్మాణం చేయరాదని, భవన నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి, నీటి పారుదల శాఖ ఏఈ అనుమతులు ఎలా ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాలువ కట్టపై శాశ్వత భవనాలు నిర్మించుకోవచ్చని అధికారులు తెలిపితే తాము కూడా శాశ్వత భవనాలు నిర్మాణం చేసుకుంటామని అన్నారు. భవన నిర్మాణంపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో కాలువ కట్టలపై ఉంటున్న పేదలందరు శాశ్వత భవనాల నిర్మాణం చేసుకుంటామని తెలిపారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేత



రంగన్నగూడెంలో ఉపకార వేతనాలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ శేషగిరి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతిభావంతులైన గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రవాసాంధ్రులు, దాతలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి ఉపకార వేతనాలు అందించడం అభినందనీయమని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి అన్నారు. బాపులపాడు మండలం రంగన్నగూడెంలో శనివారం నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మెరిట్ విద్యార్థులైన మందపాటి పూర్ణజ్యోతి, దారం కమిలినిలకు ఆళ్ల సావిత్రమ్మ మెమోరియల్ స్కాలర్‌షిప్ కింద ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున శేషగిరి చేతుల మీదుగా అందజేశారు. అలాగే ఎన్‌ఆర్‌ఐ ఆళ్ల సౌమ్య ఆర్థిక సహకారంతో 100 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పలకలు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని పీఏసీఎస్, ఆర్వో వాటర్ ప్లాంట్, పాల కేంద్రం, గ్రామ పంచాయతీ కార్యాలయాలను ఆయన సందర్శించి, అక్కడ అందిస్తున్న సేవలను అభినందించారు. లయన్స్ క్లబ్ జిల్లా క్యాబినెట్ కార్యదర్శి ముత్యాల రామారావు, వైస్ చైర్మన్ పెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, నాగార్జున సాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ, పలువురు గ్రామ ప్రముఖులు, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

దళితులకు బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం



కంకిపాడులో మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు

కంకిపాడు: దళితులకు బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం జరిగిందని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు విమర్శించారు. కంకిపాడులోని సంఘ కార్యాలయం వద్ద శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన ఎస్సీలకు రూ. 35 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ. 20 వేల కోట్లు మాత్రమే కేటాయించారని, ఇది దళితులను మోసం చేయడమేనని ఆరోపించారు. విదేశీ విద్య, అంబేడ్కర్ స్టడీ సర్కిల్, భూమి కొనుగోలు పథకం, వివాహ ప్రోత్సాహం ఊసే బడ్జెట్‌లో లేదన్నారు. ఎన్నికల హామీ మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయకుండా దళితులను చంద్రబాబు సర్కారు మోసగిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధికార ప్రతినిధి గంజి రాజ్‌కుమార్, నాయకులు సరిహద్దు ఆంథోని, రాపల్లి విల్సన్, మారుమూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



మానవ శరీరంలోని అవయవాల పనితీరును వివరిస్తున్న విద్యార్థినులు

గన్నవరం: స్థానిక విద్యానగర్ నారాయణ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. పాఠశాల విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల సైన్స్ నమూనాలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. తొలుత వైజ్ఞానిక ప్రదర్శనను పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌కే బాషా ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల సైన్స్ నమూనాలను వారి తల్లిదండ్రులు, ఇతర పాఠశాల విద్యార్థులు తిలకించారు. ఈ ఎగ్జిబిషన్‌లో వాటర్ రీసైకిల్, రామన్ ఎఫెక్ట్, చంద్రయాన్-3, మానవ శరీరంలోని అవయవాల పనితీరుకు సంబంధించిన నమూనాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని ప్రిన్సిపాల్ ఎస్‌కే బాషా పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరుల దినోత్సవం



నున్నలో మాదిగ అమరవీరుల బ్యానర్ వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

గన్నవరం: స్థానిక సుందరయ్య పార్కు ఎదురుగా ఉన్న బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ అమరవీరుల చిత్రాలకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఎంతో మంది మాదిగలు తమ విలువైన ప్రాణాలను అర్పించారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణను పూర్తిస్థాయిలో అమలు చేసినప్పుడే వారికి నిజమైన నివాళులర్పించినట్లు అని పేర్కొన్నారు. నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జ్ మంద వేణుమాదిగ, ఎంఈఎఫ్ కార్యనిర్వహణ అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు, బేడ బుడగ జంగాల నేత నాగేశ్వరరావు, సంఘ నేతలు కోట కృష్ణమోహన్, నల్లమోతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో శనివారం మాదిగ అమరవీరుల దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు అమరవీరులకు నివాళులర్పించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గన్నవరం నియోజకవర్గ ఎంఎస్సీ ఇన్‌చార్జ్ మంద వేణు మాదిగ, గన్నవరం ఎంఈఎఫ్ రాష్ట్ర నిర్వహణ అధికారి పి.బాబు, విజయవాడ రూరల్ మండల ఇన్‌చార్జ్ చిల్లిముంత కోటేశ్వరరావు మాదిగ, దేవదాసు మాదిగ, కోట కృష్ణమోహన్ మాదిగ, సుబ్బారావు మాదిగ పాల్గొన్నారు.

ముగిసిన వీజీ-టెక్నోత్సవ్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహనరావు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో జరుగుతున్న వీజీ-టెక్నోత్సవ్-2025 కార్యక్రమం శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ బీ రామ్మోహనరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ఆలోచన శక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. విద్యార్థులు వివిధ విషయాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎన్ సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ పీఎస్ శ్రీనివాస్, కన్వీనర్స్ డాక్టర్ నరేంద్రరెడ్డి, డాక్టర్ కిషోర్‌రెడ్డి, కోకన్వీనర్స్ టి.కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు. రెండు రాష్ట్రాల్లోని 27 కళాశాలల నుంచి 650 విద్యార్థులు హాజరయ్యారు. టెక్నికల్ ఈవెంట్స్‌లో 200, సాంస్కృతిక 60 విద్యార్థి బృందాలు పాల్గొన్నాయి. విద్యార్థుల సాంస్కృతి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు



ఆత్కూరులో విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న చిన్నికృష్ణ, టీబీ యూనిట్

ఉంగుటూరు: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కృష్ణా జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ చిన్నికృష్ణ అన్నారు. ఉంగుటూరు మండలం టీబీ వారోత్సవాల్లో భాగంగా ఆత్కూరులోని రీచ్ ఒకేషనల్ కాలేజీ విద్యార్థులకు శనివారం క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నికృష్ణ మాట్లాడుతూ ఎవరికైన రెండు వారాలకన్నా ఎక్కువ రోజులు దగ్గు, జ్వరం రావడం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, చాతిలో నొప్పి, దగ్గినప్పుడు కళ్లెలో రక్తం పడటం వంటి లక్షణాలు.. ఏవైనా రెండు కనిపించిన దగ్గరలోని ప్రభుత్వాసుపత్రిలో ఉచిత కళ్లె పరీక్ష ద్వారా వ్యాధి నిర్ధారణ చేసుకోవాలని తెలిపారు. స్వల్ప కాల చికిత్స ద్వారా క్షయ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని చెప్పారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల క్షయ వ్యాధి రాకుండా నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గన్నవరం టీబీ యూనిట్ సిబ్బంది రఘు, సాంబశివరావు, ఏఎస్ఎం మాలతి, సరళ పాల్గొన్నారు.